# ఖమ్మంలోనే ఉంటా..

## ఇంకా దంచాల్సిన వాళ్లని దంచే వెళ్తా

**ఖమ్మం, కెరటం న్యూస్**

కూకట్‌పల్లి నుంచి పోటీ చేయను..ఖమ్మంలోనే ఉంటానని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై వస్తున్న ఆరోపణలపై తాజాగా తెలంగాణ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ స్పందించారు. రాజకీయంగా ఎదుర్కోలేక తనపై కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూకట్ పల్లి నుంచి పోటీ చేస్తానని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఖమ్మంలోనే ఉంటానని స్పష్టం చేశారు. తన ప్రత్యర్థులను కూకటివేళ్లతో పేకిలిస్తానని చెప్పారు. ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సభ సన్నాహక సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం నియోజకవర్గం సన్నాహక సభ కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో కొద్ది మంది పనికిమాలిన బ్యాచ్ ఉందన్నారు. వాళ్లకు అబద్ధాలు చెప్పడం తప్ప ఏమీ తెలవదు.. బీజేపీ వాళ్లకు ఒక అబద్ధాల గ్రూప్ ఉందని, అజయ్ అన్న కూకట్‌పల్లి పోతుండు అని కొత్త ప్రచారం మొదలు పెట్టారన్నారు. కొంతమంది కూకట్‌పల్లి పోతడు అంటున్నారు.. అజయ్ అన్న కూకట్ పల్లి ఏం పీకటానికి పోతాడు. ఇక్కడి వాళ్ళని పీకటానికి అజయ్ అన్న ఉన్నాడు.. ఇంకా దంచాల్సిన వాళ్ళని దంచాకనే అజయ్ అన్న ఎటైనా పోతాడు.. అజయ్ అన్న సైన్యం చూసి ఎంత భయపడుతున్నారంటే.. అజయ్ అన్నను లోకల్ నుంచి పంపించి ప్రశాంతంగా ఉండాలని చేస్తున్నారు. పార్టీ ఐక్యంగా ఉంటే చూడలేకపోతున్నారు. అజయ్ అన్న ఖమ్మం ను అభివృద్ధి చేసిండు.. పాత బస్టాండ్ తీసి కొత్త బస్టాండ్ పెట్టిండు.. మళ్ళీ పాత బస్ స్టాండ్ ను సిటీ బస్ స్టాండ్ గా మార్చిండు అని ఈర్ష పడుతున్నారు.. తాగడానికి నీళ్లు లేని ఖమ్మానికి గలగల నీళ్లు పారే విధంగా చేసిన.. అక్క చెల్లెళ్ల బుగ్గల మీద సొట్టలు ఉన్నాయి కానీ బిందెల మీద సొట్టలు లేని పరిస్థితి తీసుకొచ్చిండు కేసీఆర్. రెండుసార్లకు ఇవన్నీ చేస్తే మూడోసారి మనకు ముప్పతిప్పలే అని ఈ అబద్ధపు నాయకులు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ అవకాశాన్ని 33 జిల్లాల్లో మన ఖామ్మానికి కేసీఆర్ ఇచ్చారని, ఖమ్మం మీద గాని ఖమ్మం ప్రజల మీద గాని కేసీఆర్‌కి ఎంత అభిమానం ఉందో ఒకసారి మీరే ఆలోచించండన్నారు. ఇలాంటి బంగారు అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలన్నారు. గొప్పగా మీరు వాట్సాప్ గ్రూప్ లలో ఫేస్‌బుక్ , ట్విట్టర్లు మీరు కూడా యాక్టివ్ ఉండాలన్నారు. ఖమ్మం సభను విజయవంతం చేయాలని పువ్వాడ అజయ్ కోరారు.



### సిపిఐ సీనియర్ నేత పువ్వాడకు

# కేసీఆర్ ఆహ్వానం

**వనం నాగయ్య, కెరటం న్యూస్**



సిపిఐ జాతీయ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావుకు బహిరంగ సభలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ నెల 18న బిఆర్ఎస్ ఆవిర్భావ సభ ఖమ్మంలో జరగనున్న విషయం విధితమే. ఈసభలో పాల్గొనేందుకు కేసిఆర్తో సహా నాలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, ఎస్పి నేత అఖిలేష్ పాల్గొంటున్న విషయం విధితమే. ఈసభలో పాల్గొనాల్సిందిగా పువ్వాడ నాగేశ్వరరావును కేసిఆర్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఉద్యమ సమయంలో కేసిఆర్ను ఖమ్మంజైలులో ఉంచినప్పుడు ఆ తర్వాత జైలు నుంచి ఆసుపత్రికి తీసుకు వచ్చినప్పుడు కూడా పువ్వాడ కేసిఆర్కు మద్దతుగా నిలిచారు. ఉద్యమ సమయంలోనూ ఆ తర్వాత పువ్వాడ, కేసిఆర్ మధ్య అవినబావ సంబంధాలు కొనసాగాయి. తెలంగాణ ఉద్యమ కాలంలో రాష్ట్ర ఏర్పాటుకు సిపిఐ కూడా మద్దతునిచ్చిన విషయం విధితమే. దీనిని దృష్టిలో ఉంచుకుని పువ్వాడకు ఆహ్వానం పలికినట్లు తెలుస్తుంది.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

### ముఖ్యమంత్రి కె.సి.ఆర్.కు సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బహిరంగ లేఖ

**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి నమస్కారం.**

**ఆర్యా,**

విషయము: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని.

మన తెలంగాణరాష్ట్రంలోని ప్రింట్ మరియు డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులలో 99 శాతం మంది దిగువ, మధ్య తరగతి, పేద కుటుంబాలకు చెందినవారే. వారికి వచ్చే ఆదాయంతో కుటుం బాలు గడవని దుస్థితి ఉన్నది. వృత్తి మీద గౌరవం, గుర్తింపు కోసం బ్రతుకు లీడుస్తున్నారు కాని బతకలేక పోతున్నారు. ఇది గమనించే మీరు వారి కోరికలను పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. చాలా సంవత్సరాలు అయినా అమలు కాలేదు. గతంలో మా ఖమ్మం జిల్లా జర్నలిస్టులకు ఖమ్మంలోనే యిచ్చిన హామీ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు. మీరు బి.ఆర్.ఎస్. ఆవిర్భావ సభ మా ఖమ్మంలోనే ఏర్పాటు చేయటాన్ని ఖమ్మం జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. మీ బి.ఆర్.ఎస్. ఆవిర్భావ సభ జర్నలిస్టుల సమస్యలకు పరిష్కార వేదిక అవుతుందని, వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతుందని ఆశిస్తున్నాము. డిమాండ్లు: 1) జర్నలిస్టులందరికి ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ళు యివ్వాలి. 2) వర్కింగ్ జర్నలిస్టులందరికి హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు యివ్వాలి. 3) దళిత జర్నలిస్టులకు దళితబంధు యివ్వటంతోపాటు వర్కింగ్ జర్నలిస్టులందరికి జర్నలిస్టు బంధు యివ్వాలి. 4) జర్నలిస్టులకు రాయితీతో కూడిన రైల్వే పాస్‌ను పునరుద్ధరించాలి. 5) కేరళ, తమిళనాడు, కర్ణాటక మాదిరిగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. 6)మహిళా జర్నలిస్టులకు రక్షణ, రవాణా సౌకర్యాలు కల్పించాలి. 7) జి.ఓ. నెం.239 సవరించి, ఆర్.ఎన్.ఐ.తో నడుస్తున్న చిన్న పత్రికలను ఎం. ప్యానెల్‌లో చేర్చాలి. 8)చిన్న పత్రికలకు ప్రోత్సాహకాలతోపాటు, అక్రిడిటేషన్ కార్డులు యివ్వాలి. 9) డిజిటల్ మీడియా సమస్య లన్నింటినీ పరిష్కరించాలి. 10) జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి, రక్షణ చట్టం చేయాలి. 11) డెస్క్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అవసరమైనప్పుడు విధుల్లోకి తీసుకొని, ఆపై తీసివేస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. 12) డెస్క్ జర్నలిస్టులకు 6 1/2 గం.ల పని విధానం కొనసాగించాలి. 13) యాడ్స్, సర్క్యులేషన్ టార్గెట్ పేరుతో విలేఖరులపై వేధింపు చర్యలను అరికట్టాలి.



# ఎంపీ నామకు కృతజ్ఞతలు



**వనం నాగయ్య, కెరటం న్యూస్**

శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు యాతా కుల భాస్కర్ మాదిరగ జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ నాయకత్వంలో పార్లమెంటు ప్రతిపక్ష నేత ఎంపీ నాగేశ్వరరావు ఖమ్మం పార్లమెంటు సభ్యులు కలిసి ఎస్సీ వర్గీకరణ కు చట్టబద్ధతను కల్పించాలని పార్లమెంటులో మాదిగ ఉప కులాలకు న్యాయం జరిగేలా ఏ బి సి డి లు వర్గీకరణ జరగాలని విజ్ఞప్తి మేరకు ఎస్సీ వర్గీకరణపై పార్లమెంటులో నామా ప్రస్తావించడం జరిగింది. ఈ సంధ్భంగా శుక్రవారం ఖమ్మం ఎంపీ నామా నివాసంలో మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ నామా ను కలిసి బోకియో అందించి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ అంశం గత ఎన్నో సంవత్సరాలుగా అమలుకు నోచుకోక మాదిగ ఉపకులాలు ఎంతో నష్టాన్ని చవి చూశాయని, ఎంపీ నామ వర్గీక నిమిషం పై ప్రస్తావించడం పట్ల మాదిగ జాతి యావత్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. సందర్భంగా నామా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై గతంలోని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తిరుమల చేసిందని గుర్తు చేశారు వర్గీకరణ అంశం పట్ల కేంద్రం మొండివైఖరితో వ్యవహరిస్తుందని దుయ్య బట్టారు. వర్గీకరణ అంశం తేలేంతవరకు తన వంతు సహకారంగా పార్లమెంటులో పోరాడుతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ శ్యామల మాదిగ, ఉమ్మడి ఖమ్మం జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గొల్లపల్లి నరేష్ కుమార్ మాదిగ, ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి కనకపుడి వీరస్వామి మాదిగ వైరా నియోజకవర్గ ఇన్చార్జి సగ్గుర్తి కోటేశ్వరరావు మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి కాంపల్లి గోపాలరావు మాదిగ, ఏన్కూరు మండల అధ్యక్షులు జెర్రిపోతుల నరేష్ మాదిగ భాస్కర్ మాదిగ విజయ్ మాదిగ పాల్గొన్నారు.